నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

కామారెడ్డి, జూన్ 1 : కామారెడ్డి కోర్టు సముదాయ భవనంలో నూతన చట్టాల పైన శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు భారతీయ నాగరిక సురక్ష సన్నిత, భారతీయ న్యాయ సన్నిత, భారతీయ సాక్ష ఆదీనియం అనే మూడు నూతన చట్టాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాం నాయక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌గోపాల్‌గౌడ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిమ్మదామోదర్‌రెడ్డి, నంద రమేశ్, శేషు, కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు అందరికీ సమానమే

ఎల్లారెడ్డిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న పీపీ వీరయ్య

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 1: చట్టాలు ఎవరికీ చుట్టాలు కాదని, అందరికీ సమానమేనని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరయ్య అన్నారు. ఎల్లారెడ్డిలోని మున్సిఫ్ కోర్టులో పోలీసు, ఎక్సైజ్ శాఖల సిబ్బందితో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో న్యాయాలు, చట్టాలు, సెక్షన్లపై ఆయన అవగాహన కల్పించారు. చట్టాలలో వచ్చిన మార్పులను ఆయన వివరించారు. ఏయే చట్టాలు ప్రజలకు ఎలా న్యాయం చేస్తాయో తెలిపారు. క్లిష్టమైన కేసుల్లోని పలు చట్టాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, లింగంపేట ఎస్సై చేతన్‌కుమార్‌రెడ్డి, ఏఎస్సై విజయలక్ష్మి, ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్‌తోపాటు కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల వాయిదా

బాన్సువాడ, జూన్ 1 : నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి అలీసాగర్ వరకు తాగునీటి అవసరాల కోసం ప్రధాన కాలువ ద్వారా నీటిని శనివారం విడుదల చేయనుండగా అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు నీటి పారుదల పర్యవేక్షణ ఇంజినీర్ బాన్సువాడ జగదీశ్ తెలిపారు. నీటిని విడుదల చేసే తేదీని తర్వాత తెలుపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చేపల పెంపకంతో ఆదాయం

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి రూరల్, జూన్ 1 : వ్యవసాయ క్షేత్రాల్లో ఫాంపాడ్లు నిర్మించడంతో అటు వ్యవసాయంతోపాటు ఇటు చేపల పెంపకం చేపట్టి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ రైతులకు సూచించారు. కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న ఫాంపాడ్ పనులను పరిశీలించారు. కలెక్టర్ కూడా గడ్డపార చేతపట్టి మట్టిని తవ్వుతూ అక్కడ ఉన్న కూలీలను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొర్రమీను చేపలకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉందన్నారు. ఏడాదిలో మూడు సార్లు ఫాంపాడ్‌లో చేప పిల్లల పెంపకం చేపట్టవచ్చని, తద్వారా రైతులకు ఆదాయం సమకూరడంతోపాటు ఆ నీటిని వ్యవసాయ క్షేత్రానికి తరలించవచ్చని తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో ఫాంపాడ్ నిర్మించేందుకు ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీతోపాటు సాంకేతిక సలహాలు అందిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డపార చేతపట్టి మట్టిని తవ్వుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

రేపటి నుంచి 13 వరకు
పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి, జూన్ 1 : జిల్లాలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని డీఈవో రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 869 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. జిల్లాలోని బాన్సువాడలో 1, కామారెడ్డిలో 1 పరీక్షా కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించేందుకు జిల్లా విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని తెలిపారు. పాఠశాల నుంచి హాల్‌టికెట్స్ పొందలేని విద్యార్థులు www.bse.telangana.gov.in అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

1,580 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలింపు

కామారెడ్డి, జూన్ 1 : జిల్లాలో శనివారం నాటికి 66 లారీలు సమకూర్చి 14 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,580 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత యాసంగి కొనుగోళ్లకు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు గత మార్చి 26న ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 327, ఐకేపీ ద్వారా 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 336 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని, మరో 14 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 54,353 మంది రైతుల నుంచి 3,12,492 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు. 98 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి 645 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమచేశామని తెలిపారు.

పాతఇనుప సామాన్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

కామారెడ్డి, జూన్ 1 : జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో ఉన్న పాతఇనుప సామాన్ల దుకాణంలో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రోడ్డుపైన వేసిన చెత్తకు పెట్టిన నిప్పుతో ఇనుప సామాన్ల దుకాణంలోకి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి మూడు ఫైర్ ఇంజన్లు రాగా మంటలను ఆర్పేందుకు సుమారు నాలుగు గంటల పాటు శ్రమించారు. దుకాణంలో మంటలు భారీగా ఎగిసిపడుతుండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని దుకాణం యజమాని తెలిపారు. మంటలు ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పూర్యా నాయక్ తండాలో..

రామారెడ్డి, జూన్ 1: సదాశివనగర్ మండలంలోని పూర్యా నాయక్ తండాలో శనివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో ఒక పెంకుటిల్లు దగ్ధమైంది. సదాశివనగర్ గిర్దావర్ సాహిత్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ బీల్‌సింగ్ ఇంటికి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని వంట సామగ్రి ఇతర వస్తువులు కాలిపోయాయి. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి, నాయకులు సందర్శించారు. బాధితులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.

పాతఇనుప సామాన్ల దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు

పూర్యానాయక్ తండాలో కాలిపోయిన వస్తువులు

కొవ్వొత్తుల ర్యాలీకి తరలిన బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ, జూన్ 1 : హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద అమరవీరులకు నివాళులర్పించేందుకు బాన్సువాడ నుంచి బీఆర్ఎస్ మండల ద్వితీయ శ్రేణి నాయకులు శనివారం తరలివెళ్లారు. అమరవీరులకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదివారం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి ఆవిర్భావ వేడుకల్లో పాల్గొననున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ తెలిపారు. వెళ్లిన వారిలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, దొడ్ల వెంకట్రామ్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పిట్ల శ్రీధర్, ఎజాస్, గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న ఛత్రపతి టీచర్ సొసైటీ, ఆర్యక్షత్రియ యువసేన సభ్యులు

కామారెడ్డి, జూన్ 1 : ఛత్రపతి టీచర్ సొసైటీ, ఆర్యక్షత్రియ యువసేన ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పదో తరగతి, ఇంటర్, ఎంబీబీఎస్, పాలిసెట్, ఇంజినీరింగ్‌లో ప్రతిభ కనబర్చిన ఆర్యక్షత్రియ విద్యార్థులను శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్యక్షత్రియ అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్ రావు హాజరై మాట్లాడుతూ.. ఆర్యక్షత్రియ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సమాజానికి సేవ చేయాలని అన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిం చి సమాజంలో గుర్తింపు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యక్షత్రియ జిల్లా అధ్యక్షుడు నిట్టు వెంకట్‌రావు, ప్రధాన కార్యదర్శి వజీర్ శివాజీ రావు, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగేల రాజేశ్వర్‌రావు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమత్ర ఆనంద్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆనంద్‌రావు, ఆర్కే కళాశాల కరస్పాండెంట్ జైపాల్ రెడ్డి, దత్తాత్రి, రవీందర్, టీచర్లు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రిపల్స్ లెర్నింగ్ స్కూల్‌కు ప్రభుత్వ అనుమతి లేదు

బిచ్కుంద, జూన్ 1: బిచ్కుందలోని రిపల్స్ లెర్నింగ్ స్కూల్‌కు ప్రభుత్వ అనుమతులు లేవని ఎంఈవో రాములునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిచ్కుందలోని అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలకు మండలంలోని కందర్‌పల్లి గ్రామం వద్ద శాశ్వత భవనం కోసం అనుమతి తీసుకొని, రేకుల షెడ్డుతో పాఠశాల నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. దీంతో పాఠశాల యాజమాన్యానికి నోటీసులు పంపించినట్లు తెలిపారు. పాఠశాలలో తమ పిల్లలను చేర్పిం చవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం

గాంధారి, జూన్ 1: మండలంలోని జువ్వాడి మహిళా శక్తి భవనంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని ఎంపీడీవో రాజేశ్వర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. దీంట్లో భాగంగా మహిళా సంఘాలకు ఉపాధి కల్పిండానికి పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టే అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగరాజు, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు బాలవ్వ, సీసీ భూమయ్య, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట బస్టాండ్‌ను సందర్శించిన జడ్పీటీసీ

శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, జూన్ 1: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌పై నమస్తే తెలంగాణలో మే 21వ తేదీన 'బస్టాండ్‌లో ఆటోలు..రోడ్డుపై బస్సులు..' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి స్పందించారు. బస్టాండ్‌ను శనివారం సందర్శించారు. బస్టాండ్‌లోనికి వెళ్లే దారిలో దుకాణం పెట్టుకోవడానికి ఆర్టీసీ అధికారులు అనుమతి ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి బస్సు ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నదని, కొత్తగా బస్టాండ్ నిర్మించేందుకు రవాణా శాఖ మంత్రిని కలుస్తామన్నారు. బస్టాండ్‌లో గుంతలు ఉండడంతో ఆరు నెలల క్రితం అప్పటి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి రూ.15లక్షల నిధులు మంజూరు చేయించామన్నారు. వాటితో బస్టాండ్ ముందు, బస్సులు లోపలికి వచ్చి, వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మించామని తెలిపారు.

పల్లెల్లో కానరాని ప్రకృతివనం

- గ్రామీణులకు ఆహ్లాదం కరువు
- పల్లెప్రకృతి వనాలపై సర్కారు నిర్లక్ష్యం
- గత ప్రభుత్వ ఆశయాలకు తూట్లు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 1: గ్రామాల్లో పచ్చదనం పెంచాలని, పట్టణాలకు మాత్రమే పరిమితమైన పార్కులు.. పల్లెల్లో కూడా కనువిందు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పల్లెప్రకృతి వనాలు. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రారంభించిన పల్లెప్రకృతి వనాలు గ్రామాలకు వరంగా మారాయి. మంచి వాతావరణంలో ప్రకృతి వనానికి స్థలం కేటాయించి, అందులో మంచి పూలు, పండ్ల చెట్లను నాటించి వాటిని పెంచి, మధ్యలో కూర్చోవడానికి సిమెంటు బెంచీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేసి గ్రామీణులకు అందుబాటులోకి తేవాలని సంకల్పించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై శీతకన్ను వేసింది. ప్రజలకు ఉపయోగపడేవే అయినా.. పల్లెప్రకృతి వనాలతో గ్రామాల్లో బీఆర్ఎస్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతో పల్లెప్రకృతి వనాల నిర్వహణపై పూర్తి నిర్లక్ష్యం చూపిస్తుంది. సర్పంచుల పదవీ కాలం పూర్తవడం, గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారులు కూడా పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, కంపోస్ట్‌షెడ్లు, హరితహారంలో మొక్కల నిర్వహణను ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

మండలంలోని కొక్కొండ గ్రామంలో ఏర్పాటుచేసిన పల్లెప్రకృతి వనం దీనికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నది. ఎండాకాలంలో చెట్లకు పాదులు తీసి, నీళ్లు పట్టే వారు లేక, పల్లెప్రకృతి వనం చుట్టూ రక్షణగా కంచె లేకపోవడంతో ఉన్న మొక్కలను మేకలు తింటున్నాయి. ప్రకృతి వనంలో పెంచిన పూలు, పండ్ల మొక్కలు ప్రస్తుతం కనిపించడం లేదు కానీ దట్టంగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలతో పల్లెప్రకృతి వనం పూర్తిగా రూపు రేఖలు కోల్పోయింది. పల్లెప్రకృతి వనం అనే బోర్డును చూసి గానీ గుర్తు పట్టలేని పరిస్థితి కొక్కొండ గ్రామంలో నెలకొన్నది.

కొక్కొండలోని పల్లె ప్రకృతి వనం, ప్రకృతివనంలోపల ఇదీ పరిస్థితి

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డి, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ హుస్సేన్‌ను ఎల్లారెడ్డికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఆరిఫ్‌తోపాటు మాజీ ఎంపీటీసీ షెకావత్ అలీ, మహమ్మద్ మోయిద్, క్వాజీ అఫ్జల్ హుస్సేన్, మహమ్మద్ ఖలీమ్, అబ్దుల్ వాహాబ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ పూజలు

పూజ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట, జూన్ 1: ఇన్‌చార్జి ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మండలంలోని తాండూర్ త్రిలింగేశ్వరాలయం, గోపాల్‌పేట లోని నల్ల పోచమ్మ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్‌కు ఎంపీపీ పదవి దక్కగానే ఆలయాలను దర్శించుకుంటామని మొక్కుకున్నామని, కోరిక నెరవేరడంతో మొక్కులను చెల్లించుకున్నామన్నారు. నాయకులు దుర్గారెడ్డి, హన్మంత్‌రెడ్డి, లక్ష్మీకాంతం, ఫరీద్, వంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు

మద్నూర్‌లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

గాంధారి/ మద్నూర్, జూన్ 1: రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గాంధారి ఎస్సై ఆంజనేయులు, మండల వ్యవసాయాధికారి నరేశ్ ఫర్టిలైజర్ దుకాణాల యజమానులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలను వారు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న స్టాకు, అమ్మకపు వివరాలను పరిశీలించారు. రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన అనంతరం విత్తనాలు విత్తుకోవాలని రైతులకు సూచించారు. మద్నూర్‌తోపాటు మెనూర్, పెద్ద ఎక్లారా గ్రామాల్లోని విత్తన, ఎరువుల విక్రయ దుకాణాలను మండల వ్యవసాయాధికారి రాజు, ఎస్సై శ్రీకాంత్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, లైసెన్స్, ఇన్‌వాయిస్ అందుబాటులో ఉంచుకోవాలని దుకాణ యజమానులకు సూచించారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే రైతులు కొనుగోలు చేయాలని సూచించారు.

పంటల సాగుపై అవగాహన..

డోంగ్లీ/ ఎల్లారెడ్డి రూరల్, జూన్ 1: యాసంగిలో పంటల సాగుపై డోంగ్లీ మండలంలోని లింబూర్ గ్రామ రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. చేనుల్లో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లోతట్టు పొలాల్లో సాగుచేయాల్సిన పంటలను వివరించారు. ఏఈవో నాందేవ్, రైతులు విఠల్‌రావు పాటిల్, గంగాధర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని ఏఈవో రాజాగౌడ్ రైతులకు సూచించారు. ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామంలో విత్తన కొనుగోళ్లు, పంటల సాగుపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. డబ్బులు తక్కువ అని ప్రైవేటు వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవొద్దని సూచించారు.

గుట్కా విక్రయాలపై తనిఖీలు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 1: పట్టణంలోని పలు పాన్ సెంటర్లు, గుట్కా విక్రయదారులపై పోలీసులు శనివారం దాడిచేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పాడి దాడిచేశారు. దాడుల్లో 50 నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభించాయని ఎస్సై తెలిపారు. దాడుల్లో ఎల్లారెడ్డి పోలీసులు పాల్గొన్నారు.

'వైస్ ఎంపీపీ ఆరోపణలన్నీ అబద్ధాలే..'

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 1: ఎల్లారెడ్డి వైస్ ఎంపీపీ పెద్దెడ్ల నర్సింహులు ఆరోపణలన్నీ అబద్ధాలేనని ప్రభుత్వ దవాఖానలో సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఆశమొల్ల సాయిబాబా అన్నారు. శనివారం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైస్ ఎంపీపీ వద్ద సాక్ష్యాధారాలుంటే ఎప్పుడో వాటిని బయటపెట్టేవాడన్నారు. వైస్ ఎంపీపీకి, తమకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయని, నన్ను ఎదగకుండా వైస్ ఎంపీపీ అణిచివేస్తున్నాడని ఆరోపించారు. సాక్ష్యాలు ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలతో ఎదుటివారిని కించపరుచవద్దని హితవు పలికారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS

★Wanted Teachers to teach English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant Little Hearts High School, Namdevwada, Nizamabad. Cont: 9948712344, 9666020695
NTZ-324927

శుభవార్త

★నిరుద్యోగ యువతి, యువకులకు జీవితంలో ఆర్థికంగా స్థిరపడే గొప్ప వ్యాపార అవకాశం కలదు. ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి: సెల్: 9059962194.
NTK-311380

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే